# రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

## మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

## కొత్తగూడెంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కొత్తగూడెం అర్బన్, మే 16 : ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటాలు చేస్తామని, ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రూ.500 చొప్పున రైతులకు బోనస్ చెల్లించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీరును నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యం కొనుగోళ్ల విషయంలో తాలు, తూకాల్లో కొర్రీలు పెడుతూ అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్, వనమా రాఘవేందర్‌రావు, ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోనా, పార్టీ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి శ్రీకాంత్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉప సర్పంచ్‌లు, పట్టణ, మండల కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని ఆదరించాలి
- సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఎంపీ నామా

ఖమ్మం, మే 16: గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవడమే లక్ష్యంగా సోషల్ మీడియా వారియర్స్ పనిచేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సోషల్ మీడియా వారియర్ల బాధ్యత గురుతరమైనదిగా ఉండాలని అన్నారు. బ్యాలెట్ పేపర్‌లోని మూడో క్రమ సంఖ్యలో రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్లను ఆయన కోరారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడు రాకేశ్‌రెడ్డి అని అన్నారు. సేవ చేయాలనే ఉన్నత ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. యువతలోనూ, విద్యావంతుల్లోనూ మంచి పట్టు ఉండడంతో ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా తమ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారని వివరించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలి

## ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, మే16 : కాంగ్రెస్ వైఫల్యాలను గ్రాడ్యుయేట్లకు వివరించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం టేకులపల్లి మండలం దాస్‌తండాలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులను కలిసి అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు రాకేశ్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, కంభంపాటి రేణుక, తాతా గణేశ్, శీలం రమేశ్, పరుసు వెంకటేశ్వర్లు, ఎంటీసీలు శీలంశెట్టి రమేశ్, దాస్యం ప్రమోద్, జాలది అప్పారావు, భూక్య బాలకృష్ణ, నాయకులు సిలివెరి సత్యనారాయణ, జెకె శ్రీను, పానుగట్టి రాధ, మాలోతు పూల్‌సింగ్, భూక్య రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ఏఈ

- ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు..

రూ.లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏఈ శరత్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

అశ్వారావుపేట, మే 16 : ఓ రైతు భూమికి ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.లక్ష డిమాండ్ చేసిన డిస్కం ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో గురువారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జంగారెడ్డిగూడెంకు చెందిన కొనకళ్ల జనార్దన్‌రావుకు అశ్వారావుపేట మండలం మద్దికొండలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు కనెక్షన్‌కు జనార్దన్‌రావు కుమారుడు ఆదిత్య అశ్వారావుపేట డిస్కం ఏఈ శరత్‌ను సంప్రదించాడు. ఆయన సూచన మేరకు మీ సేవ కేంద్రంలో నెల రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకయ్యే ఖర్చు రూ.1.81 లక్షల ఎస్టిమేషన్ రుసుమును కూడా డీడీ రూపంలో ఆదిత్య చెల్లించాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం, విద్యుత్ కనెక్షన్ కోసం మరో రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇస్తానని చెప్పిన ఆదిత్య ఖమ్మంలోని ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ నేతృత్వంలోని అధికారుల బృందం సూచన మేరకు లక్ష్మీతులసి పేపర్ మిల్లు సమీపంలో ఆదిత్య నుంచి ఏఈ శరత్ రూ.లక్ష లంచం తీసుకుంటుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదును సీజ్ చేసి ఏఈని కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ సోదాలు నిర్వహించిన అధికారులు పంచనామా చేసి ఏఈని అదుపులోకి తీసుకుని ఖమ్మం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రమేశ్ తెలిపారు. దాడుల్లో సీఐలు డి.సునీల్, ఎన్.శేఖర్, మహేశ్, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, సిబ్బంది రంగా, శ్రీను, శ్రీనివాసచారి పాల్గొన్నారు. కాగా.. లంచం ఇవ్వడం ఇష్టం లేకనే ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు బాధితుడు కొనకళ్ల ఆదిత్య తెలిపాడు.



సేకరించిన తునికాకులను కట్టలుగా కడుతున్న గిరిజనులు (ఫైల్)

# తునికాకు జాతర

- ఏజెన్సీలో సందడి షురూ..
- 6 ఫారెస్టు డివిజన్లలో 35 వేల స్టాండర్డ్ బ్యాగుల సేకరణే లక్ష్యం
- 50 ఆకుల కట్ట మూడు రూపాయలు
- 30 యూనిట్లలో 667 కల్లాలు ఏర్పాటు
- గిరిజనులకు నెల రోజులపాటు ఉపాధి

లక్ష్మీదేవిపల్లి, మే 16 : గిరిజనుల ప్రకృతి సంపద తునికాకు(బీడీ ఆకు) సేకరణ ప్రారంభమైంది. దీంతో ఏజెన్సీ గ్రామాల్లో జాతరను తలపిస్తున్నది. గిరిజనులు వేకువజామునే లేచి పిల్లలు, పెద్దలు తేడాలేకుండా ప్రతి ఒక్కరూ తునికాకు సేకరణలో నిమగ్నమవ్వడంతో సందడి వాతావరణం నెలకొంది. చెట్టూపుట్టా తిరుగుతూ తునికాకు సేకరిస్తున్నారు. ఎండలు మండిపోతుండడంతో తునికాకు కార్మికులు తెల్లవారుజామున చీకటితోనే అడవులకు వెళ్తున్నారు. ఉదయం 9 గంటల్లోపు ఆకులు సేకరించి ఇళ్లకు చేరుకుంటున్నారు. అనంతరం సేకరించిన ఆకును ఇంటి వద్దనే చెట్ల నీడకు చేరుకొని ఇరుగుపొరుగు వారు చుట్టూ కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ ఆకులను కట్టలుగా కడుతున్నారు. 50 ఆకుల కట్టకు ప్రభుత్వం మూడు రూపాయలు చెల్లిస్తుండడంతో మరింత సందడి నెలకొంది. ఇలా కట్టిన ఆకుల కట్టలను సాయంత్రం వేళల్లో సమీపంలోని కల్లాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. తునికాకు సేకరించి కట్టలుగా కట్టి తీసుకొచ్చిన ఆకును కల్లాల్లో వారం రోజులపాటు ఆరబెట్టిన తర్వాత వాటిని బస్తాల్లో నింపి సంబంధిత కాంట్రాక్టర్లు గోడౌన్‌లకు తరలిస్తున్నారు.



తునికాకులు సేకరించి ఇళ్లకు వస్తున్న మహిళలు

### నెలరోజులపాటు ఉపాధి

తునికాకు పనులతో కార్మికులకు సుమారు నెలరోజులపాటు చేతి నిండా పని, పనికితగ్గ వేతనం కూడా లభిస్తుంది. ఏజెన్సీలో ప్రతి ఏటా తునికాకు సీజన్ మార్చి నెల నుంచి ప్రూనింగ్ పనులు మొదలుపెడతారు. అంటే తునికి చెట్ల మండలు కొడతారు. మండలు కొట్టిన 40 రోజుల తర్వాత ఆ ప్రదేశంలో తునికాకులు ఏపుగా చిగురిస్తుంది. అలా ఏపుగా పెరిగిన ఆకును కార్మికులు చెట్టూ పుట్టా తిరిగి సేకరిస్తారు. మండ కొట్టడంతో ప్రారంభమైన తునికాకు సేకరణ కల్లాల్లో ఆరబెట్టడం, ఉల్టాపల్టా(ఒకవైపు ఆరిన ఆకును మరోవైపుకు తిప్పడం), తర్వాత ఆరిన ఆకులను బస్తాల్లో నింపి కాంట్రాక్టర్లు గోడౌన్‌కు తరలిస్తారు. దీంతో తునికాకు కార్మికులకు నెల రోజులపాటు చేతినిండా పని, పనికితగ్గ వేతనం కూడా లభిస్తుంది. గ్రామాల నుంచి సుమారు పది కిలోమీటర్ల వరకు అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకు సేకరణ చేసి తిరిగి వస్తున్నారు.



కల్లాల్లో ఆరబెట్టిన తునికాకు కట్టలు

### 35 వేల స్టాండర్డ్ బ్యాగుల సేకరణే లక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 6 ఫారెస్టు డివిజన్ల పరిధిలో ఆకు సేకరణ జరుగుతుంది. కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, కిన్నెరసాని ఫారెస్టు డివిజన్లుగా ఉన్నాయి. 30 యూనిట్లలో 667 కల్లాలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఆరు డివిజన్లలో 35 వేల స్టాండర్డు బ్యాగులు లక్ష్యంగా సేకరించాలని నిర్ణయించారు. దాదాపు రెండు వారాల నుంచి తునికాకు సేకరణ జరుగుతోంది. ఇప్పటి వరకు సుమారు 15 వేల స్టాండర్డ్ బ్యాగులను సేకరించినట్లు తెలుస్తుంది. మరో 15వేల బ్యాగుల ఆకు సేకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులను కాంట్రాక్టర్లు, అటవీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తునికాకుకు గత ఏడాది కంటే ఈ ఏడాది ఆకు ధరను పెంచడంతో ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు.

### లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు



ఈ ఏడాది అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది ఆకు నాణ్యత బాగుంది. ఆకు సేకరణ కూడా ముమ్మరంగా జరుగుతోంది. ఎండలు విపరీతంగా ఉన్నందువల్ల కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం వేళల్లో మాత్రమే ఆకు సేకరణకు వెళ్లి ఎండ తీవ్రత పెరగకముందే ఇళ్లకు చేరుకుంటే మంచిది.

– కిష్టాగౌడ్, డీఎఫ్‌వో

### 50 ఆకుల కట్టకు మూడు రూపాయలు..

కాంట్రాక్టర్ల ద్వారా 50 ఆకుల కట్టకు రూ.3 చొప్పున చెల్లించనుంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.3 చొప్పున రేటు నిర్ణయించడంతో తునికాకు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ తునికాకు సేకరణలో పిల్లలు, పెద్దలు, మహిళలు ఇలా అందరూ ఆకు సేకరణకు వెళ్తున్నారు. ప్రతి కార్మికుడికి రోజుకు 100 నుంచి 500 కట్టల వరకు వారి శక్తిని బట్టి తేగలుగుతున్నాయి. కార్మికులకు రోజుకు రూ.200 నుంచి రూ.700 వరకు ఆదాయం పొందగలుగుతున్నారు.

# 'ఆయిల్‌పాం' లక్ష్యాలను పూర్తి చేయండి

## ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేట, మే 16 : ఈ ఏడాది నిర్దేశించిన ఆయిల్‌పాం సాగు విస్తరణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఖరీఫ్ లక్ష్యాలు పూర్తయిన తర్వాత రబీ లక్ష్యాలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి అన్నారు. నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో సాగు విస్తరణ లక్ష్యాలపై గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాకు 17,500 ఎకరాలు, రబీ సీజన్‌కు 8,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు విస్తరణను వేగవంతం చేయాలన్నారు. ఖరీఫ్ లక్ష్యాన్ని ఆగస్టు నాటికి పూర్తి చేయాల్సిందేనని, ఇందుకోసం అవసరమైన పామాయిల్ మొక్కలు నర్సరీల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించిన ఆయన ఆయా ఫ్యాక్టరీల్లో చేపట్టిన సామర్థ్యం విస్తరణ పనులను తనిఖీ చేశారు. కొన్ని పనుల ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సాగు లక్ష్యాలపై క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఇప్పటికే లక్ష్యానికి అనుగుణంగా వ్యవసాయ భూముల గుర్తింపు పూర్తయ్యిందన్నారు. కొత్తగా ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు తక్షణమే మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బోరాన్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు క్షేత్ర సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఖమ్మం జిల్లా మేనేజర్ భారతి, డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు..

# ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- పోలింగ్ కోసం సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలి
- ఎన్నికల బందోబస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలి
- అధికారుల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 16: వరంగల్ – ఖమ్మం – నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక కోసం ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 27న, కౌంటింగ్ జూన్ 5న జరుగనున్నట్లు చెప్పారు. పోలింగ్‌కు సిబ్బందిని నియమించాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం 142 మంది పీవోలు, 142 మంది ఏపీవోలు, 284 మంది ఓపీవోలు అవసరమున్నట్లు వివరించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 83,879 మంది పట్టభద్రుల ఓటర్లున్నందున రిజర్వ్‌తో కలుపుకొని 129 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ ఆర్డీవోలు, తహసీల్దార్లు పరిశీలించి వసతులు కల్పించాలన్నారు. బ్యాలెట్ పత్రాల తనిఖీకి సంబంధిత బాధ్యులు పోలీస్ సెక్యూరిటీతో వెళ్లాలని సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ఎంతో ముఖ్యమని, అది వంద శాతం పూర్తి కావాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో, రిసెప్షన్ కేంద్రాన్ని నల్గొండలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూట్ల ఏర్పాటుకు కార్యాచరణ చేసి రవాణా ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. బందోబస్తు కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు సోమశేఖరశర్మ, శ్రీరామ్, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి, గణేశ్, రాజేందర్, అరుణ, మదన్‌గోపాల్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటరమణ, సతీశ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు..

# బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం

ఖమ్మం, మే 16: వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించేందుకు తమ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలోని అసెంబ్లీ ఐదు నియోజకవర్గాలకు పార్టీ ఎన్నికల సమన్వయకర్తలను నియమించినట్లు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మానికి గుండాల (ఆర్‌జేసీ) కృష్ణ, పాలేరుకు తాళ్లూరి జీవన్‌కుమార్, సత్తుపల్లికి ఎండీ ఖమర్, మధిరకు బిచ్చాల తిరుమలరావు, వైరాకు లకావత్ గిరిబాబునాయక్‌లను నియమించినట్లు వివరించారు.

# నేడు ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి పర్యటన

ఖమ్మం, మే 26: వరంగల్ – ఖమ్మం – నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి శుక్రవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారం చేస్తారు. ఆ తరువాత 8:30 నుంచి 9:30 వరకు ఖమ్మంలోని న్యాయవాద మిత్రులతో సమావేశమవుతారు. 9:30 నుంచి 10:30 వరకు నగరంలోని ప్రముఖులతో సమావేశమవుతారు.

# 20లోగా మరమ్మతులు పూర్తి కావాలి

## ఆశ్రమ పాఠశాల తనిఖీలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం/బూర్గంపహాడ్, మే 16: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మరమ్మతు పనులన్నింటినీ ఈ నెల 20లోపు పూర్తి చేయాలని, వాటి చిత్రాలను తన కార్యాలయానికి పంపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. బూర్గంపాడు మండలంలోని ఉప్పుసాక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరీ, తరగతి గదులు, టాయిలెట్లు, వాష్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. డార్మెటరీకి ఉన్న వెంటిలేటర్లకు మెష్ ఏర్పాటు చేయాలని, వాష్ రూమ్, తరగతి గదుల గోడలను ఫినాయిల్‌తో శుభ్రం చేయించాలని, పిల్లలందరూ మంచాలపై పడుకునే విధంగా విశాలంగా గదులను ఏర్పాటు చేయాలని, మూడు బెడ్లకు ఒక ఫ్యాన్ తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఇప్పచెట్లను కానీ, పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండే మొక్కలను నాటించాలని సూచించారు. పిల్లలకు గాలి, వెలుతురు, నీరు సక్రమంగావచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సెలవులకు వెళ్లిన విద్యార్థులు తిరిగి వచ్చేలోగా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దాలని స్పెషలాఫీసర్లు, హెచ్‌ఎంలకు సూచించారు. డీడీ మణెమ్మ, హెచ్‌ఎం కృష్ణ పాల్గొన్నారు.

# 'డబుల్' ఇళ్లను పూర్తి చేయాలి

## స్థాయీ సంఘాల సమావేశంలో జడ్పీ చైర్మన్ కంచర్ల



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం, మే 16 ( నమస్తే తెలంగాణ) : నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్మన్ కంచర్ల అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు వంద ఎకరాల భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఇంటి నంబర్ లేని గృహాలకు యూజర్ చార్జీలు వసూలు చేసి ఇంటి నంబర్, విద్యుత్ మీటర్ పొందే విధంగా చూడాలని డీపీవోను కోరారు. వచ్చే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు శానిటేషన్ పనుల కోసం ప్రణాళిక రూపొందించాలన్నారు. పౌష్టికాహార పథకం కింద ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలు లబ్ధి పొందుతున్నారని, వీరికి బాలామృతంతోపాటు నెలలో 16 రోజులు గుడ్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ప్రసూనరాణి, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.